కాంగ్రెస్‌కు షాక్!

- బీజేపీలోకి కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్!
- హడావిడిగా కుమారుడితో కలిసి ఢిల్లీకి పయనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ పార్టీని వీడిపోతున్న సీనియర్ల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నది. తాజాగా మధ్యప్రదేశ్‌కు చెందిన మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత కమల్‌నాథ్, ఆయన కుమారుడు నకుల్‌నాథ్‌తో సహా బీజేపీలో చేరుతున్నట్టు ఊహాగానాలు గుప్పుమంటున్నాయి. ఇదే గనుక నిజమైతే కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్ తగిలినట్టేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఊహాగానాలంతటికీ కారణం నకుల్‌నాథ్ తన ఎక్స్ ఖాతాలో కాంగ్రెస్ పేరును తొలగించటమే. నకుల్‌నాథ్ మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ తరుపున ఏకైక ఎంపీ. ఎన్నికల వేళ ఉన్న ఒక్క ఎంపీ కూడా పార్టీని వీడితే ఇక కాంగ్రెస్‌కు ఇబ్బందులు తప్పవు. ఈ ఊహాగానాలకు తోడు కమల్‌నాథ్, నకుల్‌నాథ్ ఇద్దరూ హడావిడిగా ఢిల్లీకి బయల్దేరి వెళ్ళారు. శనివారం ఢిల్లీలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశం అనంతరం కమల్‌నాథ్ బీజేపీ పెద్దలతో సమావేశమై కీలక ప్రకటన చేస్తారని వినిపించింది. కానీ కమల్‌నాథ్ మాత్రం ఇప్పటి వరకు బీజేపీలో చేరుతున్నట్టు ఎలాంటి ప్రకటన చేయలేదు. మధ్యప్రదేశ్ బీజేపీ చీఫ్ వీడీ శర్మ ఈ వదంతులపై స్పందిస్తూ.. కమల్‌నాథ్ బీజేపీలోకి వస్తే సంతోషంగా స్వాగతిస్తామన్నారు. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానించినా కాంగ్రెస్ పార్టీ తిరస్కరించటం ఆ పార్టీలోని పలువురికి నచ్చలేదని తెలిపారు. వీడీ శర్మ ఈ ప్రకటన చేసిన మరుసటి రోజే కమల్‌నాథ్ బీజేపీలో చేరుతున్నారన్న వార్తలు రావటం గమనార్హం. అయితే కమల్‌నాథ్ బీజేపీలో చేరుతారన్న వార్తను కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ ఖండించారు. తనకు కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సీటు కేటాయించకపోవడంపై కమల్‌నాథ్ అసంతృప్తితో ఉన్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి.

'ఇండియా' కథ ఏనాడో ముగిసింది

బీహార్ సీఎం నితీశ్ కుమార్

పాట్నా : రానున్న లోక్ సభ ఎన్నికల కోసం ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తేవాలనే లక్ష్యంతో ఏర్పాటైన 'ఇండియా' కూటమి కథ ఏనాడో ముగిసిందని బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ చెప్పారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ కూటమికి 'ఇండియా' అనే పేరు పెట్టడం తనకు మొదటి నుంచి ఇష్టం లేదని, వేరొక పేరు పెట్టాలని శాయశక్తులా ప్రయత్నించానని చెప్పారు. ఈ కూటమిలోని పార్టీల మధ్య సీట్ల పంపకం, పొత్తుల వ్యవహారం ముగిసి చాలా కాలం అయిందన్నారు. అందుకే తాను ఎన్డీయేతో పొత్తు పెట్టుకున్నానని, ఇది కొనసాగుతుందని చెప్పారు. నితీశ్ కుమార్‌కు తమ తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉంచామని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను విలేకర్లు ప్రస్తావించినపుడు నితీశ్ స్పందిస్తూ, తాను కూటమిలోని పార్టీలతోనూ, ప్రతిపక్ష నేతలతోనూ ఎల్లప్పుడూ సత్సంబంధాలను కొనసాగిస్తుంటానని చెప్పారు. ఎవరు ఏం చెప్పారనే విషయాన్ని తాను ఆలోచించనని, వారితో (ఆర్జేడీతో) కలిసి ఉన్నపుడు పరిస్థితులు బాగులేవని, అందుకే వారిని వదిలిపెట్టామని చెప్పారు. జేడీయూ-ఆర్జేడీ-కాంగ్రెస్ మహాకూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, మంత్రులు లలిత్ యాదవ్, రామానంద్ యాదవ్ నిర్వహించిన శాఖల్లో అక్రమాలు జరిగాయని నితీశ్ చెప్పారు. వీటిని సహించేది లేదని, దర్యాప్తు జరుగుతున్నదని తెలిపారు. ఇక 'ఇండియా' కూటమి విషయానికి వస్తే, లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ సీట్ల పంపకాల గురించి సరైన చర్చలు జరగకపోవడంతో కూటమిలోని పార్టీలు ఒక్కొక్కటిగా తాము ఒంటరిగానే పోటీ చేస్తామని, లేదా, కాంగ్రెస్‌కు తక్కువ స్థానాలు ఇస్తామని ప్రకటించడం ప్రారంభించాయి. పశ్చిమ బెంగాల్‌లో ఒంటరిగా పోటీ చేస్తామని టీఎంసీ ప్రకటించగా, ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఒక స్థానం మాత్రమే ఇస్తామని ఆప్ ప్రకటించింది. జమ్మూ-కశ్మీరులో ఒంటరిగా పోటీ చేస్తామని ఫరూక్ అబ్దుల్లా చెప్పారు. బీజేపీతో జట్టు కడతామనే సంకేతాలను ఆర్ఎల్‌డీ పంపిస్తున్నది.

పత్తా లేని 10 గ్యారెంటీలు!

ఎన్నికల ముందు ఊదరగొడుతూ ప్రచారం

15 నెలలు గడిచినా ఊసెత్తని కాంగ్రెస్ సర్కారు

గెలిపించి తప్పు చేశామంటున్న హిమాచల్ ప్రజలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఆర్భాటపు గ్యారెంటీలను గుప్పించడం.. ఆనక అధికారంలోకి వచ్చాక హామీల అమలును మరిచిపోవడం కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాలకు అలవాటుగా మారిపోయింది. కర్ణాటక, తెలంగాణలో చేసినట్టే హిమాచల్ ప్రదేశ్‌లోనూ ఇచ్చిన హామీలను గాలికొదిలేసింది హస్తం పార్టీ. అధికారంలోకి వచ్చి దాదాపుగా 15 నెలలు కావొస్తున్నా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన 10 గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధితో వ్యవహరించట్లేదు. దీంతో 'కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేశామా?' అని అక్కడి ప్రజలు మండిపడుతున్నారు.

2022 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న ఆ పార్టీ నాయకులు

అధికారంలోకి రాగానే నిర్లక్ష్యం!

2022 డిసెంబర్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 10 ప్రధాన హామీలను ఇప్పటికీ అమలు చేయట్లేదు. మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున జీవన భృతి చెల్లిస్తామని, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తామని, పాడి రైతుల దగ్గర ఆవు పాలను లీటరు రూ.80 చొప్పున, బర్రె పాలు లీటరు రూ.100 చొప్పున కొనుగోలు చేస్తామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టింది. ఆఖరుకు ఆవు పేడను కూడా కిలో రూ.2 చొప్పున కొనుగోలు చేస్తామని, 5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిలో ఏ ఒక్కదాన్ని కూడా ప్రభుత్వం అమలులోకి తీసుకురాలేదు. పగ్గాలు చేపట్టిన వెంటనే.. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును సరఫరా చేయడం పక్కకు పెట్టిన కాంగ్రెస్.. విద్యుత్తు చార్జీలు యూనిట్‌కు 86 పైసలు చొప్పున పెంచింది. అంతేకాకుండా, జలవిద్యుత్తు కేంద్రాల మీద జలవినియోగ పన్ను విధించింది. దీంతో ఈ భారం అంతిమంగా వినియోగదారులపైనే పడింది. దీనిపై ఆగ్రహించిన హక్కుల కార్యకర్తలు ఉచిత విద్యుత్తు హామీని ఎప్పుడు నెరవేరుస్తారని సర్కారును నిలదీశారు. 'ఇంకా సమయం ఉందిగా.. మరో మూడేండ్లలో అమలు చేస్తాంలే' అంటూ సాక్షాత్తూ ముఖ్యమంతి సుఖ్వీందర్ సింగ్ ఏకంగా రాష్ట్ర శాసన సభలోనే చెప్పారు.

ఒక్క హామీనైనా నిలబెట్టుకోలేదు

రాష్ట్రంలో 2.35 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 1,500 చొప్పున భృతిని చెల్లిస్తామని ఊరించిన కాంగ్రెస్ పార్టీ.. చివరకు లాహుల్ స్పితి అనే ఒకే ఒక్క జిల్లాలో ఓ మారుమూల ప్రాంతానికి మాత్రమే ఈ పథకాన్ని పరిమితం చేసింది. అదీ పైలట్ ప్రాజెక్టుగా కేవలం 9 వేల మంది మహిళలకే స్కీమ్‌ను కొన్ని నెలల పాటు వర్తింపజేసింది. ఆవులు, బర్రె పాల ధర పెంపు విషయంలోనూ కాంగ్రెస్ మాట తప్పింది. ఆవు పేడ కొనుగోలునూ ప్రకటనలకే పరిమితం చేసింది. పాత పింఛను విధానం పునరుద్ధరణ హామీని తప్పింది. 5 లక్షల ఉద్యోగాల భర్తీని గాలికొదిలేసి, రిక్రూట్‌మెంట్‌నే నిలిపేసింది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణను మరిచింది. డ్రగ్స్‌పై ఉక్కుపాదం, ఉద్యోగులకు 14 శాతం డీఏ, ఆపిల్ సాగుదారులకే ధరల నిర్ణయాధికారం వంటి హామీలను తుంగలో తొక్కింది. యువతకు రూ.680 కోట్ల స్టార్టప్ ఫండ్ స్కీమ్ ఇంకా ప్రారంభమే కాలేదు. వడ్డీ లేని రుణాలుతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 4 ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు, సంచార వాహనాలతో ప్రతి గ్రామానికి వైద్య సౌకర్యం ఇలా అన్ని హామీలను అటకెక్కించింది. దీంతో కాంగ్రెస్ వైఖరిపై ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి.

> **ఒక్క గ్యారెంటీ అయినా అమలు కాలేదు**
>
> అధికారంలోకి వచ్చీరాగానే పది గ్యారెంటీలను అమల్లోకి తీసుకొస్తామన్నారు. ఒక్క హామీని కూడా ఇప్పటికీ నెరవేర్చలేదు. అయినప్పటికీ, మూడు గ్యారెంటీలను పూర్తిచేసినట్టు కాంగ్రెస్ సర్కారు ప్రజలను మభ్యపెడుతున్నది.
>
> - రణ్‌ధీర్ శర్మ, బీజేపీ ప్రతినిధి

ప్రతిపక్షంగా ఉంటాం: పీటీఐ

ఇస్లామాబాద్: పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలిచిన పీటీఐ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తగిన పరిస్థితులు లేనందువల్ల ప్రతిపక్షంలోనే కూర్చుంటామని ప్రకటించింది. పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. శనివారం పీటీఐ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఓట్లు..సీట్లను తారుమారు చేసి ఉండకపోతే, తమకు 180 స్థానాలు లభించి ఉండేవన్నారు. పార్టీ ప్రధాని అభ్యర్థిగా ఉమర్ అయూబ్ ఖాన్‌ను పంజాబ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా అస్లాం ఇక్బాల్‌ను ఇంతకు ముందు ప్రకటించాం. తాజాగా ఈ నిర్ణయాన్ని మార్చుకున్నట్టు తెలిపింది.

నింగిలోకి 'నాటీ బాయ్'

జీఎస్ఎల్‌వీ సక్సెస్.. భూకక్ష్యలోకి ఇన్‌శాట్-3డీఎస్

శ్రీహరికోట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శనివారం శ్రీహరికోట నుంచి ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్14 రాకెట్ నిప్పులు వెదజల్లుతూ నింగిలోకి దూసుకెళ్లింది. మూడో తరం వాతావరణ శాటిలైట్ 'ఇన్‌శాట్-3డీఎస్'ను భూకక్ష్యలో ప్రవేశపెట్టేందుకు ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. 'నాటీ బాయ్' అని శాస్త్రవేత్తలు ముద్దుగా పిలిచే 2,274 కిలోల బరువు గల ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ రాకెట్ నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టనున్నది. వాతావరణ పరిశీలనను మెరుగుపరచడానికి, భూమి, సముద్ర ఉపరితలాల్ని పర్యవేక్షించడానికి ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. తద్వారా వాతావరణ అంచనా, విపత్తు హెచ్చరిక వ్యవస్థలు మరింత మెరుగుపడటానికి ఆస్కారముంది. ఈ శాటిలైట్ సేవల్ని భూ విజ్ఞాన, భారత వాతావరణ విభాగాలు వినియోగించుకుంటాయి. ఈ ఏడాది ఇస్రో చేపట్టిన రెండో రాకెట్ ప్రయోగమిది.

తమిళనాడులో పీచు మిఠాయిపై నిషేధం

రోడమైన్-బి రసాయనమే కారణం

చెన్నై, ఫిబ్రవరి 17: సైకిళ్లపై పొడవాటి కర్రకు గులాబీ రంగులో తళతళ మెరిసిపోతూ ప్లాస్టిక్ కవర్లలో దండలా వేలాడే పీచు మిఠాయి అంటే తెలియనివారు చాలా తక్కువ మంది ఉంటారు. ఇంత పాపులర్ స్వీట్‌పై తమిళనాడు ప్రభుత్వం నిషేధం విధించింది. పీచు మిఠాయిలో రంగుల కోసం ప్రమాదకర రోడమైన్-బీ అనే రసాయనాన్ని కలుపుతున్నట్టు తేలటంతో ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకొన్నది. రోడమైన్-బీ అనే రసాయనాన్ని దుస్తుల కలరింగ్, పేపర్ ప్రింటింగ్‌లో వాడతారు. ఇది ఎక్కువ మోతాదులో శరీరంలోకి వెళ్తే క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు దారి తీస్తుంది.

బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

10 మంది సజీవ దహనం

చెన్నై, ఫిబ్రవరి 17: తమిళనాడులోని విరుదునగర్ జిల్లాలో బాణసంచా ఫ్యాక్టరీలో జరిగిన భారీ పేలుడులో పదిమంది సజీవ దహనమయ్యారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నారు. వెంబకోట్టై బ్లాక్‌లోని రాముదేవన్‌పట్టిలోని కర్మాగారంలోని శనివారం మధ్యాహ్నం ఫ్యాన్సీ క్రాకర్స్ కోసం కార్మికులు రసాయనాలు కలుపుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఇప్పటి వరకు 8 మృతదేహాలను వెలికి తీశారు. నిబంధనల ప్రకారం రసాయనాలు కలుపుతున్నప్పుడు ఆ గదిలో ఇద్దరు మాత్రమే ఉండాలని పేర్కొన్నారు. కానీ ఆ సమయంలో 8 మంది ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఘటన తర్వాత కనిపించకుండా పోయిన ఫ్యాక్టరీ యజమాని, మేనేజర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఢిల్లీలో కూలిన తాత్కాలిక నిర్మాణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: దక్షిణ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణం శనివారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఇనుప శిథిలాల కింద చిక్కుకున్న 11 మందిని రక్షించినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. స్టేడియంలో ఒక వివాహ వేడుక కోసం నిర్మిస్తున్న భారీ మండపం కూలిపోవడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఇనుప పరికరాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు, వైద్య సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. తొలుత ఇద్దరిని, తర్వాత తొమ్మిది మందిని శిథిలాల నుంచి బయటకు తీసుకొచ్చినట్టు ఫైర్ అధికారులు చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది ఉండొచ్చని భావిస్తున్నారు.

గర్భిణిపై గ్యాంగ్ రేప్

నిప్పంటించిన దుండగులు

బాధితురాలి పరిస్థితి విషమం

భోపాల్, ఫిబ్రవరి 17: మధ్యప్రదేశ్‌లోని మొరానా జిల్లాలో శుక్రవారం దారుణం జరిగింది. ఓ గర్భిణి(34)పై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు ఆ తర్వాత ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించారు. 80 శాతం కాలిన గాయాలతో బాధితురాలు దవాఖానలో చికిత్స పొందుతున్నది. చావు బతుకుల మధ్య పోరాడుతున్నది. పోలీసుల కథనం ప్రకారం బాధితురాలి భర్త లైంగిక దాడి నేరంపై జైలు కెళ్లి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు. తన భర్తపై లైంగిక దాడి కేసు పెట్టిన మహిళతో రాజీ చేయించటానికి బాధితురాలు యత్నించింది. ఇందులో భాగంగా కేసు పెట్టిన మహిళ గ్రామానికి వెళ్లింది. అక్కడ ఆమె ఇంట్లోని ముగ్గురు వ్యక్తులు బాధితురాలిపై సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత ఆమెపై కిరోసిన్ పోసి నిప్పు పెట్టారు. మెజిస్ట్రేట్ సమక్షంలో ఆమె వాంగ్మూలం రికార్డు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేడీ ఎమ్మెల్యేకు ఈడీ నోటీసులు

భువనేశ్వర్: మనీ లాండరింగ్ కేసులో సీనియర్ బీజేడీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రపుల్లా సమల్‌తో పాటు ఆయన కుమారుడికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం సమన్లు జారీ చేసింది. బరపడ ఇంజనీరింగ్ కాలేజీ భూ అక్రమాలకు సంబంధించిన కేసులో సమల్‌తో పాటు ఆయన కొడుకు ప్రయస్కాంతికి కూడా సమన్లు పంపినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. అన్ని పత్రాలతో పాటు ఈడీ ఎదుట హాజరవ్వాలని నోటీసుల్లో తండ్రీ కొడుకులను ఆదేశించినట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఫోర్జరీ, మోసం కేసుల్లో ఈనెల 15న ఒడిశాలోని భద్రక్, భువనేశ్వర్ నగరాల్లోని పది ప్రదేశాల్లో ఈడీ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించింది. బరపడ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(బీఎస్ఈటీ) సొసైటీకి చెందిన మాజీ అధ్యక్షుడు ప్రయస్కాంతి సమల్, కార్యదర్శి మనోజ్‌కుమార్ గోస్వామితో పాటు పలువురిని అరెస్ట్ చేసింది. తనిఖీల్లో పలు రకాల పత్రాలతో పాటు డిజిటల్ పరికరాలు, 9 లక్షల నగదు, తేదీ లేని చెక్కులు, ల్యాండ్ అగ్రిమెంట్, 40 లక్షల రూపాయల విలువైన టాటా ఫార్చునర్ కారును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు నేరం కాదు

నాలుగో తరగతి ఉద్యోగి పిటిషన్‌పై కీలక తీర్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: నాలుగో తరగతికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి తనపై అధికారులతో సంబంధం లేకుండా నేరుగా ఉన్నతాధికారులకు సమస్య విన్నవించుకోవటం శిక్షార్హమైన నేరం కాదని సుప్రీం కోర్టు శనివారం స్పష్టం చేసింది. నాలుగో తరగతి ఉద్యోగి ఛత్రపాల్ దాఖలు చేసిన రిట్ పిటీషన్‌ను విచారించిన సుప్రీం ఈ మేరకు తీర్పునిచ్చింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ.. బాధితుడిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సుప్రీం ఆదేశించింది. ఛత్రపాల్‌ను బరేలీ జిల్లా కోర్టు నుంచి నజరత్ కోర్టుకు ప్రాసెస్ సర్వర్ ఉద్యోగిగా బదిలీ చేశారు. అయితే అతనికి పాత ఆర్డర్లో వేతనాన్నే ఇస్తుండటంతో సమస్య పరిష్కారం కోరుతూ ముఖ్యమంత్రితో సహా అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు, ప్రభుత్వంలోని మరొకొంత మంది ఉన్నతాధికారులకు విన్నవించుకున్నాడు. ఇలా చేసినందుకు అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీన్ని సవాల్ చేస్తూ బాధితుడు సుప్రీం కోర్టును ఆశ్రయించాడు.

రామభద్రాచార్య, గుల్జార్‌కు జ్ఞానపీఠ్

2023 ఏడాదికి ఎంపిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: మధ్యప్రదేశ్ తులసీపీఠం వ్యవస్థాపకులు, ఆధ్యాత్మికవేత్త రామభద్రాచార్య, ప్రముఖ ఉర్దూ కవి, హిందీ సినీ గేయ రచయిత గుల్జార్‌లను జ్ఞానపీఠ్ పురస్కారం వరించింది. 58వ జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతల పేర్లను ఎంపిక కమిటీ శనివారం ప్రకటించింది. 2023 ఏడాదికిగాను రామభద్రాచార్య, గుల్జార్‌లను ఎంపిక చేసినట్టు అవార్డు కమిటీ తెలిపింది. హిందీ సినీ గేయ రచయితగా, ఉర్దూ కవిగా గుల్జార్ అనేక అవార్డులు, పురస్కారాలను పొందారు. సాహితీ ప్రపంచంలో తనదైన ముద్రవేశారు. 2013లో దాదాసాహెబ్ ఫాల్కే, 2004లో పద్మభూషణ్, ఐదుసార్లు జాతీయ ఫిల్మ్ అవార్డులను గుల్జార్ అందుకున్నారు. మరోవైపు జగద్గురు రామభద్రాచార్య బాల్యం నుంచి అంధుడైనప్పటికీ, బ్రెయిలీ లిపి సాయం లేకుండా వివిధ భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. సంస్కృతం, అవధి, మైథిలి..తదితర భాషల్లో అశువుగా కవిత్వం చెప్పగలరు. 100కుపైగా పుస్తకాలను రచించారు. తులసీదాస్ పేరు మీద చిత్రకూట్‌లోని మత, సామాజిక సేవా సంస్థ తులసీ పీఠ్ వ్యవస్థాపకులు, అధిపతిగా ఉన్నారు.

ఎంఎస్పీపై ఆర్డినెన్స్‌కు డిమాండ్

నేడు రైతులు, కేంద్రం మధ్య చర్చలు

చండీగఢ్ : రైతుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటే, తక్షణమే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని రైతు సంఘం నేత సర్వన్ సింగ్ పంధేర్ శనివారం డిమాండ్ చేశారు. శంభు సరిహద్దుల వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ''సీ2 ప్లస్ 50 శాతం''డిమాండ్‌కు సంబంధించినంత వరకు ప్రభుత్వం ''ఏ2 ప్లస్ ఎఫ్ఎల్'' ఫార్ములా ప్రకారం ధరను నిర్ణయిస్తున్నదన్నారు. ఇదే ఫార్ములా ప్రకారం ఆర్డినెన్స్‌ను తీసుకురావచ్చునన్నారు. రైతుల వ్యవసాయ రుణాల మాఫీ విషయంలో రుణాల మొత్తాన్ని అంచనా వేయవలసి ఉందని ప్రభుత్వం చెప్తున్నదని తెలిపారు. రైతు సంఘాల నేతలు, కేంద్ర మంత్రుల మధ్య నాలుగో విడత చర్చలు ఆదివారం జరగనున్నాయి.

నాలుగు రాష్ట్రాల్లో ధర్నాలు : టికాయత్

ఎంఎస్‌పీకి చట్టబద్ధ హామీతోపాటు ఇతర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 21న ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, పంజాబ్‌లలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ టికాయత్ శనివారం చెప్పారు. సిసౌలీలో జరిగిన పంచాయత్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల డిమాండ్లను కేంద్రం పరిష్కరించకపోతే, నెలాఖరులో ఢిల్లీలో ట్రాక్టర్ మార్చ్ నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చాను కోరుతూ ఓ తీర్మానాన్ని ఆమోదించామని చెప్పారు.

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు దాదాపు పూర్తి

సీఈసీ రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ: లోక్‌సభతో పాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయని ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ వెల్లడించారు. ఎలక్టోరల్(ఎన్నికల) బాండ్ల పథకంపై ఇటీవల సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగానే ఎన్నికల సంఘం పనిచేస్తుందని స్పష్టం చేశారు. శనివారం భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ పారదర్శకంగా పనిచేస్తుందని తెలిపారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్లో పేర్కొన్నట్టు చెప్పారు. ఈవీఎంలు లేకుండా ఎన్నికల నిర్వహణ అంశంపై స్పందిస్తూ ఈ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నదని, తీర్పు వచ్చాక, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు కూడా తాము సిద్ధంగా ఉన్నట్టు ఆయన ప్రకటించారు.

అమృత్‌పాల్ వద్ద స్పై కెమెరా

గువాహటి: ఖలిస్థానీ వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్, అతని అనుచరులను నిర్బంధించిన అస్సాంలోని డిబ్రుగర్ కేంద్ర కారాగారంలో భద్రతా లోపం బయటపడింది. సింగ్ వద్ద చట్టవిరుద్ధంగా ఉన్న స్పై కెమెరా, స్మార్ట్‌ఫోన్, కీప్యాడ్ ఫోన్, పెన్ డ్రైవ్స్, బ్లూటూత్ హెడ్‌ఫోన్స్, స్పీకర్స్, స్మార్ట్ వాచ్ మరికొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

370 లోక్‌సభ సీట్లతో ముఖర్జీకి నివాళి ఇద్దాం

బీజేపీ పదాధికారుల సమావేశంలో మోదీ పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా 370 లోక్‌సభ సీట్లు గెలవాలని.. అలా జరిగితే అదే ఆర్టికల్ 370 రద్దు కోసం పోరాడిన పార్టీ సిద్ధాంత కర్త శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నిజమైన నివాళి అర్పించినట్టు అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన బీజేపీ పదాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి బూత్ వర్కర్ పోలింగ్ బూత్‌పై దృష్టి పెట్టాలని, పార్టీకి కనీసం 370 సీట్లు వచ్చేలా చూడాలని కోరారు. మోదీ ప్రసంగం గురించి బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే విలేకరులకు వివరించారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు అనవసరమైన భావోద్వేగ సమస్యలను లేవనెత్తుతాయని చెప్పారు. పార్టీ సభ్యులు మాత్రం దేశాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, పేదలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. ఫిబ్రవరి 25 నుంచి పార్టీ ప్రచారాన్ని ప్రారంభిస్తుందని వెల్లడించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 12 ఏండ్లు, ప్రధానిగా పదేండ్లు కలిపి.. సుమారు 23 ఏండ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నా ఒక్క చిన్న అవినీతి ఆరోపణ కూడా రాలేదని తావ్డే చెప్పారు. ఈ కాలమంతా ఆరోప్ ముక్త్, వికాస్ యుక్త్ (ఆరోపణలు లేని వికాసంతో కూడిన) కాలం అని ఆయన అభివర్ణించారు. మోదీ పదేండ్ల పాలనలో 'రామ రాజ్యం' కలసాకారమైందని ఈ సమావేశంలో రాజకీయ తీర్మానాన్ని ఆమోదించారు.

విశ్వాస పరీక్షలో నెగ్గిన కేజ్రీవాల్

అనుకూలంగా 54 మంది ఎమ్మెల్యేల ఓటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఢిల్లీ అసెంబ్లీలో శుక్రవారం సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం శనివారం దాదాపు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. బీజేపీ ఎమ్మెల్యే రామ్‌వీర్ సింగ్ భిదూరి మినహా తక్కిన 54 మంది ఆప్ ఎమ్మెల్యేల మద్దతుతో విశ్వాస తీర్మానం ఆమోదం పొంద